# 3వ కథ.

# రంగి.

*

"స్త్రీకి ప్రధానం శీలం- అది పోయిననాడు ఆస్త్రీ
జీవితానికి ఒక అర్థమే లేదు."

*

విల్లీస్ జీపు వచ్చి బంగళాముందు ఆగింది. నారాయణ జీపుదిగి వెనకాల త్రాళ్ళతో కట్టిన సామాన్లూ జీపులో నున్న హోల్డాలు తీసి- లోపలకు తీసుకవెళ్ళాడు. పరిసరాలు పరికిస్తూ లోపలకు దారితీశాడు మధు. చుట్టూ ఎత్తైన సర్విచెట్లూ- పొదలూ తప్ప అక్కడ వేరే ఏమీ కొంపలు లేవు. ఆఅడవిలో జంతుసంచారంతప్ప మానవసంచారం అసలే వుండదు. అప్పుడప్పుడు 'ఫారెస్టురేంజి' అధికారులు వచ్చినప్పుడు- ఆబంగళాలోనే బసచేస్తూంటారు. రెండు సంవత్సరాలక్రితం మధు ఆప్రాంతానికి 'కన్సర్వేటర్'గా వచ్చాడు. కానీఅలావచ్చిన రెండునెలలకేతిరిగివెళ్ళిపోయి-అధికారులను ఒత్తిడిచేసి అక్కడనుండి- వేరొకప్రాంతానికి బదిలీ చేయించుకున్నాడు. అలావెళ్ళిపోయిన రెండేళ్ళకు- ఇప్పుడు- మళ్ళీ అదేప్రాంతానికి వచ్చాడు మధు. అక్కడకు రావటమంటే మధుకు భయమే అయినా- తప్పలేదు. టూర్ చేయడానికి ఒక జీపు, నెలకు నాలుగువందలు దాకా జీతం, ఎల్లప్పుడూ దగ్గర వుంచుకోవటానికి ఒక జవాను - ఇవన్నీ 'భయం' పేరుతో వదలుకోనలేక, ఇంట్లోవాళ్ళు వద్దంటున్నా వినక, అక్కడకు వచ్చేశాడు మధు.

ఆ అడవిప్రాంతానికి చుట్టుపట్ల ఐదారుమైళ్ళు దూరంలో చిన్నచిన్న గ్రామాలున్నాయి. ఒకచోటనుండి వే

రొక చోటికి పోవాలంటే మధ్యలో వున్న ఆ అడవి దాటవలసిందే! భయంకరమైన కోరల్తో- చూడగనే వణుకు పుట్టించే పెద్దపులులు ఆఅడవిలో ఎక్కువ! పింఛం విప్పి- నృత్యం చేస్తూ- చూడగనే ముచ్చట కలిగించే నెమళ్లూ వున్నాయి- ఆఅడవిలో! ఎలుగులూ, జింకలూకూడా అరుదుగా తిరుగుతూంటాయి. అందుకనే గ్రామాలకు పోయేజనం- జట్లుజట్లుగా కబుర్లు చెప్పుకుంటూ పోతూంటారు. రాత్రిసమయాల్లో ప్రయాణంచెయ్యనే చెయ్యరు. ఒక వేళ అడవిదాటుతుండగా- చీకటిపడబోతుంటే- ఆబంగళాలో ఆరాత్రి గడిపి మరునాడు- పొద్దెక్కినతరువాత- వెళ్లిపోయేవారు. ఆబంగాళాలో మొత్తం ఎనిమిదిగదులు కాబోలు వున్నాయి. చాలా విశాలంగా వుంటాయి. ఒకగదిలో డైనింగ్ టేబిలూ దానిచుట్టూ కుర్చీలు. వేరొకగదిలో పెద్దపట్టెమంచమూ- డ్రెయరూ- నిలువుటద్దమూ- వున్నాయి. ఆబంగాళాకు కాపలాగా ఒకమాలి వుంటాడు. వచ్చినవాళ్లకు అన్ని సదుపాయాలూ సమకూరుస్తూ- అవసరమయితే అన్నంకూడా వండిపెట్టి- వారు వెళ్లిపోయేముందు 'మామూలు' పేరుతో 'పావలా' 'అర్ధా' తీసుకుంటూంటాడు. జీపులోనుంచి మధు దిగటంతో- మాలి ఎదురువచ్చి నమస్కారం చేశాడు.

"ఏమోయ్! బాగున్నావా? నన్ను మళ్లీ ఇక్కడకు బదిలీచేశారు- నాభారమంతా ఇకనుంచీ నీదే!"- అన్నాడు మధు నవ్వుతూ!

"చెప్పాలా దొరా!- నీళ్లు సిద్ధంగా వున్నాయి. మీరు ముందు స్నానానికి లేవండి. ఈలోగా చితుకులేరి తెచ్చి వంటకూడా మొదలెడతాను"- అంటూ వెళ్లిపోయాడు మాలి.

మాలి అంటే మధుకు చాలా అభిమానం. మొదట్లో ఆప్రాంతానికి తాను వచ్చినప్పుడు- తన అవసరాలన్నీ చూస్తూ వేళకింత ఉడకేసి పెడుతూ, రాత్రిళ్ళు ఆ అడవుల్లో జరిగే వింతలూ విశేషాలూ చెబుతూండేవాడు- ఎందుకనో 'మాలీ'ని ఒక ఆప్తునిలాగా అభిమానించేవాడేకానీ- కేవలం 'మాలీ'గా మాత్రం చూసేవాడు కాడు.

అంతలోనే డ్రైవరు నారాయణ లోపలనుంచి ఒక కుర్చీ తెచ్చి బయట వరండాలో వేశాడు. కూర్చొని- సిగరెట్టు ముట్టించాడు మధు. పాతస్మృతులన్నీ ఒక్కొక్కటిగా మధుమస్తిష్కంలోకి వస్తున్నాయి.

"స్నానానికి లెండి దొరా"- అన్న మాలి పిలుపుతో ఆలోచనలనుండి తేరుకొని- లోపలకు దారితీశాడు మధు!

* * *

మరునా డుదయం!...

కాలకృత్యాలనంతరం- సిగరెట్టు వెలిగించి, అంతకు ముందునాటి- దినపత్రిక చూస్తున్నాడు మధు.

"దండం దొరా!"

పేపరు పత్రిక్కకు తొలగించి చూశాడు! ఎదురుగుండా గంగన్న!

మధు చేతిలోని సిగరెట్టు అప్రయత్నంగా క్రిందపడి పోయింది. చుట్టూ చల్లని గాలి వీస్తున్నా- మధుకు గంగన్నను చూడగానే ముచ్చెమటలూ పోశాయ్!.

రెండునిముషాలవరకూ నిశ్చేష్టుడైపోయాడు...

"అదేంటి దొరోయ్- గట్ట సూస్తుండావ్?- నేను గంగన్నని!- యాదికిలేదా?"- మళ్ళీ పరిచయం చేసుకున్నాడు గంగన్న.

"ఎందుకొచ్చావ్?"- ఎక్కడలేని ధైర్యాన్ని కూడదీసుకొని అడిగాడు మధు.

గంగన్న మాట్లాడలేదు. తలవంచుకొని అక్కడే మెట్లమీద కూర్చుండిపోయాడు. అప్పుడే ఇవతలకు వచ్చిన నారాయణ గంగన్నను చూశాడు. గబాగబా లోపలకు పరుగెత్తి- ఇనుపకడ్డీ నొకదానిని తీసుకవచ్చి- "మళ్ళీ సిద్ధమయ్యావా? ఇవాళ నీఅంతుచూడందే వదిలేదిలేదు"- అంటూ దానిని పైకి ఎత్తాడు నారాయణ.

"ఆగు"- అని గట్టిగా అరిచాడు గంగన్న.

"ఏందయ్యా! అసలే సేసిన పాపానికి గుండె మండిపోతా

వుంటే - నువ్ మరేను"- అన్నాడు గంగన్న అమాయకునిలా పైమీది తుండుగుడ్డతో చెమర్చిన కళ్లను తుడుచుకుంటూ.

"ఏం జరిగిందో చెప్పు గంగన్నా" అన్నాడు పూర్తిగా తేరుకున్న మధు.

"రంగి సచ్చిపోయింది దొరా"- ఈమాటంటూంటే గంగన్నకు దాదాపు ఏడుపే వచ్చింది. తుళ్లిపడ్డాడు మధు.

"ఎప్పుడు??"...

"ఈయాల్టికి నాలుగు మాసాలు కావస్తోందయ్యా" అని రెండు నిముషాలాగి- "దానికి సావురా నేను. 'ఆత్మహత్య' సేసుక మరీ సచ్చిపోయింది. నాగుండెల్లో సిచ్చుపెట్టిపోయిందిదొరా!" కన్నీరు ఆగిందకాదు గంగన్నకు.

ఊరుకో గంగన్నా! ఎలా చచ్చిపోతే నేం? అనేకమంది హోదాలో వుండి చచ్చిపోతారు. చచ్చిపోయిన తరువాత కూడా గౌరవమర్యాదలు పొందుతారు. మరికొందరు అనామకులుగానే పోతారు. కానీ చచ్చిపోయినతరువాత అందరూ బూడిదే అవుతారు. కానీ రంగి జీవితం ఇలా ముగుస్తుందనుకోలేదు గంగన్నా"- నిట్టూర్చాడు మధు.

"మన్నించండి దొరా! దాని మనసు తెలుసుకోనేక బలవంతం సేసాను. నాతో మనువు ఇట్టంలేక ఉరేసుక సచ్చి

పోయింది- మీకు అన్యాయంచేశాను దొరా- మన్నించండి"- అంటూనే నిష్క్రమించాడు గంగన్న. నారాయణకూడా లోపలకు వెళ్ళిపోయాడు- ఒక్కసారిగా మధు ఆలోచనలు రెండుసంవత్సరాలు వెనక్కి మళ్ళాయి.

* * *

అప్పటికి మధు ఆప్రాంతానికి వచ్చి పదిరోజులయింది. స్నేహితులతో సినిమాలు చూస్తూ- సముద్రపు తీరానికి పోయి ఒంటిగా వచ్చే కన్నెపిల్లలను హేళనచేస్తూ సరదాగా కాలం గడిపే మధుకు- ఆఅడవిప్రాంతంలో ఒంటరిజీవితం పిచ్చెత్తినట్లుండేది. సాయంత్రసమయాల్లో తన రివాల్వర్ తీసుకొని అడవిలో తిరిగేవాడు. వెనకాలే నారాయణకూడా 'గన్' ఒకటి భుజాన్నేసుకొని వెంట వెళ్లేవాడు. కబుర్లతో ఎన్నిమైళ్లో తిరిగి- చీకటిపడే సమయానికి బంగళా చేరుకునేవారు. అప్పుడప్పుడు- అంటే వారం పదిరోజుల కొకసారి తన డిపార్టుమెంటు ఆఫీసర్లు వస్తే-వారితో ఒకటి రెండు రోజులు సరదాగా కాలం గడిపేవాడు మధు.

ఆరోజు సాయంత్రం- నారాయణకు సుస్తీగా వుండటంవలన, మధు ఒక్కడే బయల్దేరాడు. ఆకాశాన్నంటుతున్న చెట్లు, పక్షుల రొద- ప్రకృతి అంతా మనోహరంగా వుంది. విచిత్రమైన ప్రకృతిని తిలకిస్తున్న మధు- ఒక్కసారిగా ఆర్త

నాదం వినిపించటంతో తుళ్ళిపడి అటువైపు పరుగెత్తాడు.
తనకు పాతికడుగుల దూరంలో- అక్కడకు మరోపాతికడు
గుల దూరాన పడుకొనివున్న- పులిని చూసి వణికిపోతోంది
ఆమె. పరిస్థితి నర్థంచేసుకున్నాడు మధు. ఒక్క ఉదుటున
వెళ్ళి పడిపోబోతున్న ఆమెను పట్టుకున్నాడు. రెండు నిము
షాల్లో తేరుకొని అతన్ని చూసింది ఆమె. సిగ్గులాంటి
భయంతో ఆమెశరీరం ముద్దకట్టుకపోయింది.

"ఎందుకంత భయం? అది మనల్నేమీ చేయదు.
ఇప్పుడే ఎక్కడో సుష్టుగా భోజనం చేసింది." అన్నాడు
నవ్వుతూ మధు. అర్థంకాక అటువైపే చూస్తోంది ఆమె.
వెల్లకిలా నోరు తెరచుకొని పడుకొనివుంది పులి. దానికి కుడి
ప్రక్కన నిలబడి- పులికోరలమధ్య తన ముక్కుతో పొడు
స్తోంది నెమలి.

"నెమలికి పులి అంటే భయం లేదా!" అని ప్రశ్నిం
చింది ఆమె.

"ఉండదు. పులి ఏదైనా జంతువును తిన్నప్పుడు దాని
కోరలమధ్య ఎముకముక్కలూ- మాంసపుకండలూ చిక్కు
కొని బాధ కలిగిస్తాయి. ఆబాధకు ఓర్చుకొనలేక ఆవిధంగా
పడుకుంటుంది పులి. ఆసమయంలో నెమలి వచ్చి- ఆకోరల
మధ్య చిక్కుకున్న ఎముకలముక్కల్నీ మాంసపుకండల్నీ-

తన ముక్కుతో బయటకు తీసేస్తుంది. అది అలా తీస్తున్నంత సేపూ- హాయిగా-మత్తుగా- వుంటుంది పులికి- తర్వాత బాధ తీరిపోతుంది"- అంటూ సృష్టివైచిత్ర్యాన్ని విడమమర్చి చెప్పాడు మధు.

"ఓలమ్మో! సీకటి పడిపోతున్నాది"- అంటూ అంతలోనే నాలుగడుగులు ముందుకేసింది ఆమె. ఒక్కసారిగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు మధు. అతనివైపు వెనుతిరిగి చూసింది ఆమె. తెల్లని గుండ్రని ముఖం; పట్టుమని ఇరవై సంవత్సరాలయిన వుండివుండవు. వెనక్కు దువ్వుకున్న జుట్టును ఎడమపక్కన, కొప్పుగా అమర్చుకుంది. కళ్ళు చిన్నవే అయినా- చుట్టూవున్న నల్లని కాటుకవలన విశాలంగా కనిపిస్తున్నాయి. పొంగి పొరలుతున్న యౌవనపు వంపుల్ని- బిగువయిన రవికతోనూ- మోకాళ్ళవరకూ పైకి పోయిన చిలుకాకుపచ్చరంగు చీరతోనూ- కప్పుకుంది. రవికకూ చీరకూ మధ్య నగ్నంగా కనిపిస్తోంది ఆమె సన్నని నడుం! నలుమూలలా అలుముకుంటున్న చీకటి ఛాయల్ని చీల్చుకుంటూ వస్తున్న చంద్రుని కాంతిలో ఆమె నాపాద మస్తకం పరీక్షగా చూస్తున్నాడు మధు.

"ఏందయ్యో! కొరుక్కుతినేలాగా సూస్తుండావ్? అమాయకం ప్రతిధ్వనించింది ఆమె ప్రశ్నలో!

"నువ్ చాలా అందంగా వుంటావ్ సుమా"! నిజాన్ని దాచకుండా చెప్పాడు మధు!

"అలాగే అంటాడు మా మావకూడా!"_ మురిసిపోయింది ఆమె.

"నీపేరేమిటి?"

"రంగి!"... మా అయ్యేమో "చిట్టీ" అని పిలుస్తాడు. మామావ 'మరదలా' అంటాడు... కానీ నాకు 'రంగీ' అంటేనే ఇష్టం"

"అలా అయితే నేను రంగీ అని పిలుస్తాను" అంటూ నవ్వాడు మధు. నవ్వకుండా వుండలేకపోయింది రంగి.

రోజూ సాయంత్రం సమయంలో రంగి కనబడుతూనే వుంటుంది. ఏదో మాట్లాడాలని ఆరాటపడేవాడు. కానీ పరిస్థితులు అనుకూలించేవి కాదు. ఏరోజూ రంగిని చూడకుండా వుండలేకపోయేవాడు మధు.

ఆరోజు ... మధుజీవితంలో మధువును చిలికించిన రోజు_ తానున్నంతకాలమూ, తలపుకు రాగానే పరవశం కలిగించే రోజు... ఇప్పటికీ-ఎప్పటికీ మధుకు గుర్తయినరోజు.

ఎత్తుగా వున్న కొండమీద- పొడుగ్గా వున్న సర్వి చెట్టుకింద కూర్చొని ఏవో బొమ్మలు గీస్తున్నాడు మధు_

దూరాన రంగి- చిన్నతట్ట చంకనెట్టుకొని వెడుతూండటం చూశాడు. వెనకనే వెళ్ళి- గాలికి రెపరెపలాడుతున్న చీర చెరగును పట్టుకున్నాడు...ఉలికిపాటుతో కెవ్వున కేకవేసి- వెనుతిరిగి చూసి- సిగ్గుతో ముడుచుకపోయి- తలవంచేసుకుంది రంగి.

"ఇంటికి వెళ్ళిపోతున్నావా- ఎలా ప్రారంభించాలో తెలియక రెండు నిముషాలు ఆలోచించి ప్రశ్నించాడు.

"అవునయ్యా! ఇయాలా మా అయ్యకు ఒల్లుబాగో లేదు!- పెందలాడే పోతుండా"-

"వెడుదువుగానిలే! అలాకూర్చుందాం! నిన్ను ఇంటిదగ్గర నేను దిగవిడుస్తాన్లే" ఆవిధంగా- ఒంటిగా పోయే కన్నెపడుచుతో అలామాట్లాడ్డానికి అప్పుడు ధైర్యంఎలావచ్చిందో ఇప్పుడు అంతుబట్టదు మధుకు!

పెద్దమఱ్ఱిచెట్టుక్రింద కూర్చున్నారు ఇద్దరూ!

"మీరు పట్నంనుంచి వచ్చారా దొరా?" రంగి ప్రారంభించింది.

"అవును! నువ్వెప్పుడయినా పట్నం వెళ్ళావా?"- ప్రశ్నించాడు మధు.

"లేదు. మావ ఎల్లిండు; ఆడ అదేందో - బొమ్మలు సూపెట్టే సిన్మాలుంటాయట - ఎంతో గొప్పగా చెప్పిండు

మావ!"— రంగి అమాయకత్వం - మధును ఆశ్చర్యంలో ముంచేసింది.

"నాతో వస్తే పట్నం తీసుకెడతాను - అక్కడ కొత్త కొత్త చీరలు పెద్దమేడలు - బొమ్మలు చూపెట్టే సినీమాలూ అన్నీ ఉంటాయి. మనకి కారుకూడా వుంది వచ్చేస్తావా?"- కుతూహలంగా అడిగాడు.

"ఓలమ్మో! మావకు తెలిస్తే నరికి పోగులెడతాడు" - "భయంలేదు-నేనున్నాగా" ఆమె భుజంమీద చేయివేశాడు మధు. ఆస్పర్శకు ఆమె ఒళ్ళు ఝల్లుమంది. మధులోని కోరిక కట్టలు తెంచుకుంది. అమాయకురాలు రంగికి- మధు ఏమి చేయదలచుకున్నాడో ముందు తెలియలేదు.

"రంగీ!"- చుట్టూ వున్న కొండల్లో ప్రతిధ్వనించింది ఆగర్జన... పుష్పంలో చొచ్చుకొని మధువును గ్రోలుతున్న సీతాకోకచిలుక ఎగిరిపోయింది ఆగర్జనకు. పాలిపోయిన అధరాలతో- బరువెక్కిన కనురెప్పలతో- గంగన్నవద్దకు వచ్చింది రంగి. పరిస్థితి నర్థంచేసుకున్నాడు గంగన్న. చేతిలోని గడ్డపారను అవతలకు విసిరేశాడు. గంభీరంగా అడుగులు వేసుకుంటూ మధుదగ్గరకు వచ్చాడు. గంగన్న నడుస్తూంటే- భూమి అదురుతోందా అనిపించింది మధుకు. విశాలమైన ముఖం- మెలితిరిగిన మీసాలూ- దట్టంగా పెరిగిన కను

రెప్పలూ- కండలుతీరిన శరీరం- పెద్ద వస్తాదులా వున్నాడు గంగన్న. తిన్నగా వచ్చి మధుచొక్కాను పట్టుకున్నాడు. పెద్దపులికి సైతం బెదరని మధు- గంగన్నను చూసి బెదిరి పోయాడు. అంతలోనే ధైర్యం తెచ్చుకొని గంగన్న మెడకు ఎడమవైపున బలంగా గుద్దాడు. రెండుగజాలదూరంలో పడి పోయాడు గంగన్న. రంగి హడలిపోయి కెవ్వుమంది. ఆ దెబ్బతో- గంగన్నలో ప్రతీకారవాంఛ రగుల్కొంది. కళ్లు కోపంతో ఎర్రనయినాయి. పిడికిలి బిగించి లేచాడు. అను కోని పరిస్థితికి తుళ్ళిపడ్డాడు మధు. వెంటనే జేబునుండి తన రివాల్వర్ తీసి గాలిలోకి ప్రేల్చాడు. ప్రక్కనున్న రంగి ఒక్కఉదుటున వచ్చి మధు కాళ్ళమీద పడిపోయింది.

"మన్నించండి దొరా!- మామావఁ!- నాకు అమ్మ లేకపోయినా మామావలో- అమ్మను సూసుకుంటున్నాను" అంటూ ఏడిచింది రంగి.

"రేయ్! నేనెవరికీ దడిసిపోయే రకం, పిరికివాణ్ణి కాదురా!- రంగి నాకు చిన్నప్పుడే పెళ్ళాంగా పుట్టింది. రంగిని మనువాడుతానని మాఅక్కకు మాటిచ్చాను. దాని విషయంలో నువ్ కలగచేసుకున్నావ్- నువ్వు సదువుకున్నో డివి; మాకు కీడు జరిగినా నీవల్ల పదిమందికి మేలుజరుగుతుం దని ఇడిచిపెడుతున్నాను. కానీ రేపీయాల్టికి- మల్లీ ఈసుట్టు

పట్ల కనపడితే- నామరూపాలు లేకుండా నరికేస్తాను"- ఆవే-
శంతో గంగన్న అరుస్తూంటే మధు హడలిపోయాడు. తాను తలచుకుంటే ఒక్క పిస్తోలుదెబ్బతో గంగన్నను నేల కూల్చగలడు. కానీ తాను చదువుకున్నాడు. సంస్కారమూ, సభ్యతా గలవాడు. ఆవిధంగా ఒక నిండుప్రాణాన్ని బలి తీసుకొని- మరోజీవికి నీడలేకుండా చేయలేడు. కానీ గంగన్న లాంటి అడివిమనుషులు- ప్రాణాలనుకూడా లెక్కచెయ్యరు.

ఆలోచించి- ఆరాత్రి ఒకనిశ్చయానికి వచ్చిన మధు— మరునాటి ఉదయమే ఆప్రాంతం వదలి వెళ్ళిపోయి- వేరొక చోటికి బదిలీ చేయించుకున్నాడు.

* * *

గతాన్ని తలచుకొన్న మధు మనస్సు వికలమైపోయింది. రంగి ఆత్మశాంతికన్నట్లు రెండుక్షణాలు కళ్లు మూసుకున్నాడు. మూతలుపడ్డ కనుకొనలనుండి రెండు అశ్రుకణాలు- అతనిచేతిలోని పేపరుమీద పడి వింతశబ్దం చేశాయి. ఆశబ్దం "నువ్ రంగికి అన్యాయం చేశావ్"- అన్నట్లుగా ప్రతిధ్వనించింది మధు ఎదలో !

——